
దరఖాస్తుల పేరిట.. దళారుల దందా



ప్రభుత్వం ప్రారంభించని పథకాలను దళారులు ప్రచారం చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే దళితబంధు రెండో విడత, అభయ హస్తం తదితర పథకాల పేరుతో సామాన్య ప్రజల జేబులు గుల్ల చేస్తున్నారు. ఇప్పుడు 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' దరఖాస్తు పేరుతో దందాకు తెర తీశారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు సంబంధించి ఓ దరఖాస్తు.. సోమవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని అందులో పేర్కొన్నారు. దీంతో రేషన్‌కార్డు లేని వారు, కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలనుకునేవారు దళారుల గాలానికి చిక్కే ప్రమాదముంది. ఈ నెల 3 నుంచి 7 వరకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం పైలట్ ప్రాజెక్టుగా మాత్రమే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే చేపట్టింది. అందుకోసం ప్రత్యేకంగా ఎలాంటి దరఖాస్తులను విడుదల చేయలేదు. దీనిపై వరంగల్ తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తు జారీ చేయలేదని స్పష్టం చేశారు. - న్యూస్‌టుడే, వరంగల్ కలెక్టరేట్

జగన్మాతా.. పాహిమాం!



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తవాడలో జగన్మాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 50 శిరస్సులు, 70 చేతులు కలిగిన భవానీమాత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. - న్యూస్‌టుడే, కొత్తవాడ

పండగ పూట.. తాగునీటి గోస

కార్పొరేషన్, న్యూస్‌టుడే


● పర్యవేక్షణ కరవై ప్రజలకు చేరలేని దుస్థితి

లెక్కల్లోనే..

నగర జనాభా 11 లక్షల పైచిలుకు ఉంటుంది. ప్రతిరోజూ 190 మిలియన్ లీటర్ ఫర్ డే (ఎంఎల్‌డీలు) ఇవ్వాల్సి ఉండగా.. ప్రస్తుతం 205.41 ఎంఎల్‌డీలు ఇస్తున్నారు. లెక్కకు మించి నీటి సరఫరా చేస్తున్నట్లు బల్దియా లెక్కలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అన్నిచోట్ల ఆ పరిస్థితి లేదు.

30 శాతం వృథా..

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ప్రతి రోజూ 30శాతం నీటి వృథా(క్లియర్ వాటర్) అవుతోందని సర్వేలో తేలింది. పైపులైన్ లీకేజీలు, మెయిన్ పైపులైన్లకు బైపాస్ లైన్లు ఉండటం, అక్రమ కుళాయిలు తదితర కారణాలతో ప్రతిరోజూ 55-60 ఎంఎల్‌డీల తాగునీరు వృథా అవుతోంది.



సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల వేళ నగరంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ధర్మసాగర్ చెరువులో సమృద్ధిగా నీళ్లు ఉన్నా.. శుద్ధీకరణకు సరిపడా వ్యవస్థ ఉన్నా నగర ప్రజలు దాహంతో అల్లాడాల్సిన పరిస్థితి. గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రెండు, మూడు వారాలుగా కుళాయిల్లో రంగుమారిన నీళ్లు సరఫరా అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సోమవారం 'న్యూస్‌టుడే' బృందం కాలనీల్లో నీటి సరఫరాపై పరిశీలన చేపట్టగా.. అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

సమస్యలు ఇలా..

- క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది కొరత
- ఏఈలు, డీఈలు నీటి సరఫరాను పట్టించుకోవడం లేదు.
- సమయపాలన పాటించడం లేదు.
- నిర్ణీత సమయానికి డివిజన్లలో వాటర్ ట్యాంకులు నిండటం లేదు.
- నీటి వృథాపై ఎలాంటి చర్యలు లేవు.
- తాగునీటి సరఫరా విభాగంలో సరిపడా సిబ్బంది లేరు.

పరిశీలన



దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో తాగునీటిని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి



ధర్మసాగర్ చెరువులో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది



శివనగర్ నీళ్ల ట్యాంకు వద్ద అద్దె ట్యాంకర్లు

నాలుగు రోజులకోసారి.. గంటసేపు మాత్రమే!

ఖిలావరంగల్: ఖిలావరంగల్ పడమర, మధ్య, తూర్పుకోట, పుప్పాలగుట్ట, చింతల్ 36, 37, 38 డివిజన్లలో నాలుగు రోజులకో గంటపాటు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని ప్రధాన నీళ్ల ట్యాంకులకు పంపింగ్‌లో ఏర్పడిన జాప్యం జరగడం వల్ల సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. 43వ డివిజన్ పరిధిలోని నాయుడు పెట్రోల్ పంపు, వినాయకకాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో పైపులైన్ నిర్మాణం చేపట్టలేదు.

మా కాలనీలో పైపులైన్లు లేవు

- మాలోతు సుమలత వెంకటేశ్వరకాలనీ



మా కాలనీలో నల్లానీరు అంటే తెలియదు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, కమిషనర్, ఇతర అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా నేటికి మా కాలనీలో పైపులైన్ నిర్మాణం చేపట్టలేదు. తాగునీరు కొనుక్కొని తాగాల్సిందే.

ఇబ్బందులు రాకుండా చూస్తాం

- ప్రవీణ్‌చంద్ర, ఎస్‌ఈ, నీటి సరఫరా

పండగ పూట ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. నాలుగైదు రోజులుగా ఇదే పనిలో ఉన్నాం. పుప్పాలగుట్ట, కరీమాబాద్ ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయి. వాటిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం.



29వ డివిజన్ రఘునాథ్ కాలనీలో రంగుమారిన నీరు

రామన్నపేట: వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ రఘునాథ్ కాలనీ, ఓఎస్‌నగర్, పాపయ్యపేట, రామన్నపేటలో రెండురోజులకు ఒకసారి నీటి సరఫరా అవుతోంది. నెలరోజులుగా రంగుమారిన నీళ్లు వస్తున్నాయి.

● 11వ డివిజన్ రంగంపేట, సరస్వతి కాలనీ, స్మార్ట్‌రోడ్డు, పోతననగర్, ముదిరాజ్‌వాడల్లో నీటి సమస్య ఉంది.

నిత్యం ఎదురుచూపులే..

- కోడకండ్ల సరిత, రఘునాథ్ కాలనీ



వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ రఘునాథ్ కాలనీ, రామన్నపేటలో నల్లా నీళ్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రెండు, మూడు రోజులకోసారి వస్తున్నాయి. వారం, పది రోజులుగా రంగుమారిన నీళ్లు వస్తున్నాయి. లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది.



ఉర్సులో నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్న స్థానికులు



ప్రతాప్‌నగర్‌లో చేతిపంపు వద్ద మహిళలు

ఉర్సు, కరీమాబాద్‌లో..

కరీమాబాద్, న్యూస్‌టుడే: 40వ డివిజన్ ఉర్సు, కరీమాబాద్‌లో నల్లాలు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉర్సు ప్రతాప్‌నగర్ హరిజనవాడ ప్రజలకు చాలాకాలంగా తాగునీరు రావడం లేదు. భగీరథ నల్లానీరు విడుదల సమయంలో సరిపడా ప్రెషర్ లేక స్థానికంగా ఉన్న ట్యాంకు నిండటం లేదు. బక్కివాడ, అంకంవాడ, చెట్లోళ్లగడ్డ ప్రాంతంలో నల్లానీరు రావడం లేదని స్థానికులు తెలిపారు. నీటి సరఫరాను మానిటరింగ్ చేసే విధానం సరిగాలేదని చెప్పారు. దీంతో తాగునీరు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. కొన్ని ప్రాంతాల్లో చేతి పంపులపై ఆధారపడుతున్నారు.

అయిదేళ్లుగా అవస్థలు..: శివనగర్ 34వ డివిజన్ పల్లవి ఆసుపత్రి సత్యసాయిబేకరీ లేన్, ఊపూడి శైలజ వీధిలో 50 నివాసాలకు అయిదేళ్లుగా నల్లా నీళ్లు రావడం లేదు. అయిదేళ్ల కిందట పల్లవి ఆసుపత్రిలేన్‌లో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం చేపట్టిన పనుల సమయంలో ఈ ప్రాంతానికి వచ్చే నల్లానీటి పైపులు దెబ్బతిన్నాయి. వాటిని స్థానంలో ఇప్పటి వరకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. చాలామంది మినరల్ క్యాన్‌వాటర్‌పై ఆధారపడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారు బోరు నీటిపంపులకు నీటిశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు.

తాగునీరు కొంటున్నాం..: - పసునూరి సురేష్, స్థానికుడు



అయిదేళ్లుగా తాగునీరు కొనుగోలు చేసి తాగుతున్నాం. బల్దియా కమిషనర్‌ను, గత ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందించినా ఇప్పటివరకు స్పందించలేదు. గత ఎన్నికల్లో మాకు నల్లాలు ఇప్పిస్తేనే ఓటేస్తామని చెప్పాం. అప్పుడు హామీ ఇచ్చినవారు ఇప్పుడు కనిపించడం లేదు.

పనులు పూర్తి.. నిలిచిన నీరు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట-ఇల్లంద గ్రామాల మధ్య ఉన్న ఆకేరు వాగు చెక్‌డ్యామ్ గతేడాది వచ్చిన వరదలకు కోతకు గురైంది. దీంతో పైనుంచి వచ్చిన వదర నీరు దిగువకు వృథాగా పోయింది. మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనివల్ల వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి తాగునీరు, వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలకు సాగునీరు అందకుండా పోతుంది. సమస్యను 'ఈనాడు' ప్రత్యేకంగా తీసుకొని చెక్‌డ్యామ్ మరమ్మతుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులపై వార్తల రూపంలో ఒత్తిడి తెచ్చింది. రైతులు, స్థానిక రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడటంతో పనుల్లో వేగం పెరిగింది. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రైతులు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు స్థానిక జడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలకుర్తి సారంగపాణితో తాత్కాలిక పనులను పూర్తి చేయించారు. సోమవారం ఎమ్మెల్యే చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేసిన సారంగపాణిని అభినందించారు. చెక్‌డ్యామ్ శాశ్వత పనులు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



చెక్‌డ్యామ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మార్కెట్‌కు దసరా సెలవులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులపాటు దసరా సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం తెలిపారు. ఈ నెల 10న దుర్గాష్టమి, 11న మహర్నవమి, 12న విజయదశమి పండగ సందర్భంగా, 13న మార్కెట్‌కు వారాంతపు సెలవు కావడంతో బంద్ ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత రోజుల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు. ఈ నెల 14 నుంచి మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి



బాలసముద్రం వెహికిల్ షెడ్డులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: హనుమకొండ బాలసముద్రంలో ఆధునిక చెత్త రవాణా కేంద్రంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే గుత్తేదారుకు సూచించారు. సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి బాలసముద్రం వెహికిల్ షెడ్డు, వరంగల్ పోతననగర్ చెత్త రవాణా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. స్వచ్ఛ ఆటోల ద్వారా సేకరించే చెత్తను ఇక్కడి నుంచి రవాణా చేయాలన్నారు. వాహనాల మరమ్మతులు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు డా. రాజారెడ్డి, డా. రాజేష్, డీఈ సారంగం, ఏఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు లేకుండానే పనుల అప్పగింత?

నర్సంపేట, న్యూస్‌టుడే: మున్సిపాల్టీల పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులైనా టెండర్ పద్ధతిలో చేయించాలి. నర్సంపేట మున్సిపాల్టీ తీరే వేరు.. ఇక్కడ టెండర్లను పిలవకుండానే రూ.లక్షల విలువైన పనులను కొందరు కౌన్సిలర్లకు అప్పగించారు.

● గణేశ్ నిమజ్జనం, బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్ల కోసం రూ.24.89 లక్షలు కేటాయిస్తూ గత నెల 12న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. వినాయక నిమజ్జనానికి రూ.3 లక్షలు, బతుకమ్మ, దసరా వేడుకలకు రూ.21.89 లక్షలు కేటాయించారు.



నర్సంపేటలో బతుకమ్మలను నిమజ్జనం చేసే మాదన్నపేట చెరువు కాలువ

ఏం చేశారంటే..: మంజూరైన పనులను భాగాలుగా విభజించారు.. టెండర్లు లేకుండానే కౌన్సిలర్లకు అప్పగించారు. గణేశ్ నిమజ్జనం కోసం మూడు పనులకు రూ.3 లక్షలు మంజూరు కాగా ఒక్కో పనికి రూ.99 వేల చొప్పున కేటాయించి మూడు పనులను వేర్వేరుగా నామినేషన్ పద్ధతిలో చేయించారు. తొలి రోజు బతుకమ్మ మైదానాల్లో క్రషర్ దుమ్ము పోసేందుకు రూ.3 లక్షలు మంజూరు కాగా.. మూడు భాగాలుగా విభజించి ఒక్కో పనిని రూ.99 వేల చొప్పున చేయించారు. విద్యుత్తు దీపాలు, సౌండ్స్ కోసం మంజూరైన రూ.3 లక్షలను సైతం మూడు భాగాలుగా విభజించి ఒక్కో పనికి రూ.99 వేల చొప్పున నామినేషన్‌లో చేయించారు. సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు రూ.16 లక్షల పనులను మూడు విభాగాలుగా విభజించారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పనులను ఇద్దరు కౌన్సిలర్లు చేశారు. బతుకమ్మ, దసరా వేడుకల ఏర్పాట్ల పనులను మరో ఇద్దరు కౌన్సిలర్లు పంచుకున్నారు. ఈ నిధులతో బతుకమ్మ వేడుకల ప్రారంభం రోజు పట్టణంలో తొమ్మిది చోట్ల, సద్దుల బతుకమ్మ పట్టణంలోని ఐదు ప్రదేశాల్లో, దసరా రోజు అంగడి మైదానంలో రావణవధ వేడుకలకు ఏర్పాట్ల పనులు చేయాల్సి ఉంది.

అంతా మొక్కుబడిగా..

గతంతో పోలిస్తే బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు మొక్కుబడిగా ఉన్నాయి. ఏటా విభాగినులతో పాటు వాటి మధ్య ఉన్న చెట్లను రంగు రంగుల సిరీస్ బల్బులతో అలంకరించేవారు. ఈసారి ప్రధాన మార్గంలోని డివైడర్లలో తక్కువ బల్బులు వేసినా కొన్ని చోట్ల వెలగడం లేదు. విభాగినుల మధ్య పచ్చని చెట్లను సిరీస్ బల్బులతో అలంకరించలేదు. బతుకమ్మ ఆడే మైదానాల్లో మొక్కుబడిగా క్రషర్ దుమ్ము పోసి వదిలేశారు.. బతుకమ్మ వేడుకల తొలిరోజు వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు కొన్ని చోట్ల సౌండ్ సిస్టమ్ బాగా లేక బతుకమ్మ పాటలు సరిగా వినబడలేదని, పాటలు కూడా మామూలుగా ఉన్నాయని మహిళలు వాపోయారు. * ఈ విషయాన్ని పుర ఏఈ రాజేశ్ వద్ద ప్రస్తావించగా రూ.5 లక్షల విలువైన రెండు పనులకు, రూ.4 లక్షల, రూ.2 లక్షల విలువైన పనులకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచామని, మంగళవారంతో టెండర్ ముగుస్తుందని చెప్పారు..



ఈవీ.. ఛార్జింగ్ కేంద్రాలేవీ?

● ఓరుగల్లులో పెరుగుతున్న విద్యుత్తు వాహనాలు

ప్రయివేటు కంపెనీలు ఏర్పాటుచేసిన రెండు మూడు చిన్న ఛార్జింగ్ పాయింట్లు మాత్రమే వరంగల్ ప్రాంతంలో ఉన్నాయి.


'మూడేళ్ల కిందట తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో) నగరంలో పది ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు సర్వే చేపట్టింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.'



ఈనాడు, వరంగల్, రంగశాయిపేట, న్యూస్‌టుడే

రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు, ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వాలు విద్యుత్తు వాహనాలను (ఈవీ) ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఈ వాహనాలను విక్రయించే షోరూంల సంఖ్య పెరుగుతోంది. ఈ- కార్లు, విద్యుత్తు ఆటోలు, ఇతర పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కోసం నగరంలో సరిపడా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం పెద్ద లోటు. హైదరాబాద్ పరిధిలో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన రెడ్కో ఓరుగల్లులో పెట్టకపోవడంతో సుదూరాల నుంచి నగరానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

నిట్ సాంకేతిక అండ



ఈవీ ఛార్జింగ్ స్టేషన్లపై నిట్ రూపొందించిన ప్రాజెక్టు

నగరంలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ పూర్తి సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. రెండేళ్ల కిందట 'ఆప్టిమల్ లొకేషన్ ఆఫ్ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ వరంగల్' అనే పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పేర్లి సురేశ్‌బాబు నేతృత్వంలో దీన్ని పూర్తి చేశారు. నగరంలో వాహనాల రద్దీ దృష్ట్యా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఎక్కడెక్కడ వస్తే బాగుంటుంది.. సబ్‌స్టేషన్ల నుంచి ఏ మేరకు విద్యుత్తు అవసరం ఉంటుందని లోతుగా అధ్యయనం చేసి పరిశోధన పత్రం రాస్తే అది స్విట్జర్లాండ్ జర్నల్‌లో ప్రచురితమైంది. నగరంలో 39 కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆ ప్రాజెక్టు ద్వారా గుర్తించారు.


స్టేషన్ల ఏర్పాటు ఎంతో అవసరం



వరంగల్‌లో ప్రయివేటు ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్

వాహనాల్లో పెట్రోలు, డీజిల్ వేయించుకోవడం సులువు. రెండు మూడు నిమిషాల్లో పూర్తవుతుంది. అదే విద్యుత్తు ఛార్జింగ్‌కు చాలా సమయం పడుతుంది. గంటల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్టేషన్లు ఉంటే కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి సౌకర్యం ఉంటాయి. వీటిని ప్రభుత్వం ఏర్పాటుచేస్తే విద్యుత్తు ధరలు కూడా తక్కువగా ఉంటాయి.

● నగర వాసులు డీజిల్, పెట్రోల్ నుంచి ఎల్‌పీజీ, సీఎన్‌జీకి. ఇప్పుడు క్రమంగా ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. 2022లో హనుమకొండ జిల్లాలో ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు 375 రిజిస్ట్రేషన్ కాగా.. గతేడాది 736, ఈ ఏడాది ఇప్పటికే 950 దాటిపోయాయి. కార్ల కొనుగోలుపై నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల కిందట 15 ఉండగా, గతేడాది 67కు చేరాయి. ఈ ఏడాది ఇప్పటికే 36 దాటిపోయాయి. డిసెంబరుకల్లా వందకు చేరే అవకాశం ఉంది.



కార్లకు కష్టమే - శ్రీకాంత్, హనుమకొండ



నాకు ద్విచక్ర విద్యుత్తు వాహనం ఉంది. ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకుంటాను. మా స్నేహితులు హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చినప్పుడు అదనపు బ్యాటరీలు తెచ్చుకుంటున్నారు. లేదా మా ఇంట్లో ఛార్జింగ్ పెట్టడం వల్ల గంటల తరబడి సమయం వృథా అవుతోంది. ఛార్జింగ్ స్టేషన్ ఉంటే కొద్ది సమయం సరిపోతుంది. ఓరుగల్లు నగరంలో ప్రభుత్వం ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి.



విద్యుత్తు ద్విచక్రవాహనం



ఈవీ ఆటో

ఆర్టీసీ కూడా మరిచింది

వరంగల్ రీజియన్ ఆర్టీసీ బస్సుల్లో కొన్ని ఈవీలను వినియోగిస్తామని మూడేళ్ల కిందట ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఆర్టీసీ అనేక ఈ బస్సులను తీసుకొచ్చింది. అదే స్ఫూర్తితో మొదటి దఫాలో ఓరుగల్లు నగరంలో 10 విద్యుత్తు బస్సులు తెస్తామని ప్రకటించి.. అంతటితో ఆ ప్రతిపాదన అటకెక్కించింది.

దిల్లీ విధానం భేష్



కేంద్ర ప్రభుత్వం 2030 కల్లా దేశంలో సగానికి సగం విద్యుత్తు వాహనాలనే రహదారులపై తీసుకురావాలనుకుంటోంది. ఈ క్రమంలో దిల్లీ ప్రభుత్వం అక్కడి వాయు కాలుష్యం దృష్ట్యా ఈవీలను బాగా ప్రోత్సహిస్తోంది. 'స్విచ్ దిల్లీ' పేరుతో పాలసీ రూపొందించింది. 30 వేల ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 2,452 ఏర్పాటు చేసింది. ఛార్జింగ్ స్టేషన్లు 1,919 ఉన్నాయి.

ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న జి.సీతారెడ్డిని హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, ఇక్కడ పనిచేస్తున్న ఎం.ఎ.షుకూర్‌ను ఇంతేజార్‌గంజ్‌కు బదిలీ అయ్యారు. కమిషనరేట్‌లో నుంచి జె.వెంకటరత్నంను మిల్స్ కాలనీ స్టేషన్ సీఐగా వెళుతున్నారు.




నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!

● అరుదైన జంతువుల అక్రమ రవాణా

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

ఉమ్మడి వరంగల్ జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు నెలవైన ప్రాంతాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి తీరం వెంట దట్టమైన, పచ్చని అడవుల్లో జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. వేటగాళ్లతో వాటికి ముప్పు వాటిల్లుతోంది.. గుట్టుగా వేటాడి వన్యప్రాణుల చర్మాలు, గోళ్లు, మాంసంతో వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వేట మాత్రం ఆగడం లేదు.. గత శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన జంతువులను ఏకంగా ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. నూతన పంథాలో దుండగులు పాంగోలిన్(అలుగు)ను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.



చెన్నై బ్యూరో సభ్యులు మాటేసి..

ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా.. స్థానిక అధికారులు ఈ విషయాన్ని పసిగట్టలేదు. వాట్సాప్ గ్రూపును చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొనుగోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ చేరుకున్నారు. దుండగులు చెప్పినట్లుగా భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వచ్చారు. మాటు వేసి అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు..

పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూప్ నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు. ఇలాంటి నెట్‌వర్క్‌తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్మయాన్ని కలిగిస్తోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

మరో 8 మంది గుర్తింపు..

అలుగు విక్రయంలో ముందుగా ముగ్గురిని పట్టుకున్నారు. అయితే దీని వెనుక తతంగం నడుపుతున్న 8 మందిని గుర్తించారు. కాటారం, భూపాలపల్లి, మహముత్తారం మండలాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన వారుండటం గమనార్హం. అందులో ఓ రాజకీయ నేత కూడా ఉన్నాడు. ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకుంటే ఈ దందా పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందినవారు ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

అరుదైన జంతు విక్రయాల ముఠాలు..

అంతరించిపోతున్న జంతువులను వేటాడే దుండగ ముఠాలు తిరుగుతుంటాయి. అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలుగును ఒకరు రూ.30 వేలకు కొన్నట్లు సమాచారం. వాటి పొలుసులకు డిమాండ్ ఉంటుందనేది ప్రచారంలో ఉంది. ఒక్కో పొలుసు రూ.3 లక్షల ధర పలికినట్లు తెలిసింది. అరుదైన జంతువులకు ధరలు ఊహించవని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

రాత్రిళ్లే ఎక్కువగా వేట సాగుతోంది. రాత్రిళ్లు అటవీ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. వేటగాళ్లు ఆయుధాలతో ఉంటారు. ఇది అధికారులకు సమస్యగా మారింది. వారికి కూడా రక్షణ కరవైంది. తగిన చర్యలు తీసుకుని ఇప్పటికైనా వేటను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఉచ్చులు.. విద్యుదాఘాతం

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘాతంతో మనుషులు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

వేటను అరికడుతున్నాం..

-వసంత, డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి

వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల వధ్యాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రి పూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్యప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

హాని తలపెడితే శిక్ష తప్పదు..

- వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా.. భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.
- పులి, అలుగు, ఇతర షెడ్యూల్-1లో పరిధిలోని ప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదవుతుంది. 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా పడుతుంది.
- రెండోసారి కూడా అదే తప్పుచేస్తే రూ.25 వేల జరిమానా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష.
- పులి ఉండే అభయారణ్యంలోని కోర్ ఏరియాల్లో వేటాడితే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుంది.
- రెండు అంతకంటే ఎక్కువసార్లు వేటాడితే రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- పులిని వేటాడినట్లు సరైన ఆధారాలుంటే నిందితులను వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు..

లలితా మహా త్రిపురసుందరి దేవిగా భద్రకాళి





పల్లకిలో అమ్మవారి ఉత్సవమూర్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారు లలిత మహ త్రిపురసుందరి(రాజరాజేశ్వరి)గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ, సాయంత్రం శేష వాహన సేవ జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు లలిత మహాయాగంలో పాల్గొన్నారు. 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

'బోధనా రుసుం విడుదలైతేనే కళాశాలలు తెరుస్తాం'

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు దసరా తరువాత నిరవధికంగా మూసివేస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘ బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత మూడేళ్ల నుంచి యాజమాన్యాలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల జాప్యం కారణంగా, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనం విడుదలలో ఆలస్యం కారణంగా అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామన్నారు. పది నెలలుగా ముఖ్యమంత్రికి, వివిధ శాఖల మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా, నేటివరకు ఎలాంటి పరిష్కార నిర్ణయం వెలువడలేదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘ బాధ్యులు

డీసీసీబీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధన

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ నెల ఒకటి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరంగల్ డీసీసీబీ, రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలోని కేంద్ర బ్యాంకులకు దీటుగా వరంగల్ డీసీసీబీ ఉత్తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని బ్యాంకు కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, సీఈవో, అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. తొలుత బ్యాంకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినందుకు ఆయన కేకు కోసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్‌కు తినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడుతూ తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.12 వందల కోట్ల మాత్రమే టర్నోవర్ ఉండేదన్నారు. ఈ ఘనత సాధనలో తోడ్పడిన సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు, సీఈవోలు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ పొందిన బ్యాంకు పరిధిలోని రైతులందరికీ వెంటనే కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్లకు సూచించారు. రుణమాఫీకి అర్హతగల రైతుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై జిల్లా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇంకా డీసీసీబీ జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, ప్రవీణ్, కృష్ణమోహన్, రాజునాయక్, ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయల్లో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్ జంప్



-న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌలి ఆకాడమీకి చెందిన మోహితేష్‌రావు 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహుకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అండర్-20 బాలికల 800 మీటర్ల పరుగులో విజేతలు



60 మీటర్ల పరుగు పందెం..

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట, న్యూస్‌టుడే: పక్షం రోజులుగా రద్దయిన రైళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్- హసన్‌పర్తి రోడ్ మధ్య నాలుగో లైను పనుల కారణంగా సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు కాజీపేట- బల్లార్ష, వరంగల్- బల్లార్ష మార్గంలో నడిచే దాదాపు అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. దూర ప్రాంత రైళ్లను మాత్రం నడిపించారు. రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, ఇంటర్‌సిటీ, సింగరేణి 8వ తేదీన, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 9వ తేదీ నుంచి ప్రారంభమౌతాయి. పండగ వేళ రద్దు కావడంతో ప్రయాణికులు ఇప్పటికే ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు చేశారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే చాలా మంది రిజర్వేషన్లు చేసుకున్నారు. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీలో వెయిటింగ్ లిస్టు ఎక్కువగా ఉంది.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు శిక్ష

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో చొరబడి.. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లిన నలుగురు దోపిడీ దొంగలకు ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ.. హనుమకొండ జిల్లా ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి క్షమాదేశపాండే సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అలవాల సమ్మయ్య 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన షేక్ అలీ హైదర్, కుమారస్వామి, శంకర్, మధుకర్, కోరుట్లకు చెందిన శివప్రసాద్, మహ్మద్ ఆసిఫ్ ఒక ముఠాగా ఏర్పడి.. హనుమకొండలోని గణేశ్‌నగర్‌కు వచ్చారు. అలవాల సమ్మయ్య భార్య ఒంటరిగా ఇంట్లో ఉండటాన్ని గమనించారు. బయట ఒకరు కాపలా ఉండి.. మిగతావారు ఇంట్లో చొరబడి ఆమెను బంధించారు. విలువైన వస్తువులు మాటగడుతుండగా.. అదే సమయంలో బయటకు వెళ్లిన సమ్మయ్య ఇంటికి వచ్చారు. బయట ఉన్న వ్యక్తిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా.. అతడు సమ్మయ్యను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించారు. అనంతరం ఆభరణాలు, నగదు, చరవాణులతో ఉడాయించారు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా శిక్ష విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సింగరాజు శ్రీనివాస్ వాదించారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సుభాష్ సాక్షులను ప్రవేశపెట్టారు.

నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళి శాఖ ఏడీ రాఘవరావు తెలిపారు. ప్రదర్శనలో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే చేనేత సహకార సంఘాలు, సంస్థలు ఎలాంటి రుసుం లేకుండా అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్ షీట్లు, లుంగీలు, టవళ్లు, పత్తిరోజులు, కార్పెట్లు తదితరాలు విక్రయిస్తారని తెలిపారు. పలు సంఘాల నుంచి 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటున్నట్లు రాఘవరావు తెలిపారు.

రసం పీల్చే.. పురుగుల పనిపడదాం..!

పేనుబంక : లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చుతాయి. ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్యపంటగా ఉంది. పూత, కాత దశలో ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతున్న పరిస్థితిని గమనించామని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, పంట ఉత్పత్తి విభాగ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు. సస్యరక్షణ చర్యలను 'రైతేరాజు'కు వివరించారు.

-న్యూస్‌టుడే, మానుకోట



తామరపురుగు : తల్లిపిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులో ఉండి రసం పీల్చుతాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ 1.5 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటర్ నీటికి లేదా డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు

పిండినల్లి : చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లిపురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత గల వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 50 ఈసీ లేదా మిథైల్‌పారాథియాన్ 50 ఈసీ ఎసిఫేట్ 2 గ్రాములు+ట్రైటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులు ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగుభాగాన పిల్ల, తల్లి పురుగులు చేరి రసం పీల్చడం ద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులో మారుతాయి. నివారణకు.. ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లొనికామైడ్ లేదా ఫిప్రోనిల్ లీటరు నీటికి రెండు మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ ఒకటిన్నర గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

లేదా స్పైనటోరం 0.9 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : పిందె, కాయ దశలో ఆశిస్తుంది. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. నివారణకు డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమెసిఫెన్ ఒక మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు లేదా పైరిప్రాక్సిఫెన్ 0.76 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



రైతు రవీందర్

రైతేరాజు



మిరపనారు

కొంటున్నారా.. జాగ్రత్త సుమా!

మానుకోట, న్యూస్‌టుడే : మిరపనారు కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల తెలిపారు. ప్రైవేటు నర్సరీల నుంచి మాత్రమే మిరప నారును కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చే మిరపనారు కొనుగోలు ఎలాంటి ధ్రువీకరణ, బిల్లులు లేకుండా కొనుగోలు చేయవద్దు. పేరొందిన నర్సరీలు, రకాల నారును కొనుగోలు చేయాలి. ఉద్యాన శాఖలో ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ విషయంలో ఏమైనా సందేహాలుంటే రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను సంప్రదించాలని చెప్పారు.




సర్వి చెట్లు.. ఆదాయానికి మెట్లు

న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా) : తక్కువ పెట్టుబడితో సర్వి మొక్కల పెంపకం చేపడితే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం బాగిర్థిపేట గ్రామానికి చెందిన రైతు రవీందర్.. ఎకరానికి మూడేళ్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని 'రైతేరాజు'కు వివరించారు. 'భాగిర్థిపేటలో రెండెకరాలు, కొత్తపల్లిలో మరో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమిలో రెండేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఓ మిత్రుడి సూచనతో అంతర్గత పంటగా సర్వి మొక్కలు పెంపకం చేపట్టాను. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు నుంచి రూ.2.40 పైసలకు మొక్క చొప్పున సుమారు 3600 మొక్కలు కొనుగోలు చేశాను. ఐదుగురు కూలీల సాయంతో రెండెకరాల్లో 19 నెలల కింద మొక్కలను నాటాను. 30 నుంచి 36 నెలలకు మొక్కలు కటింగ్ కొరకు చేతికొస్తాయి. ఒక్కో టన్నుకు రూ.5600 నుంచి రూ.6600 వరకు ధర ఉంటుందని కంపెనీ వారు చెప్పారు. ఎకరానికి సుమారు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రెండెకరాల్లో సుమారు 120 నుంచి 140 టన్నుల వరకు కలప వస్తే.. టన్నుకు రూ.5600 ధర ఉన్నా ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీ(పేపర్ మిల్లు) వారే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. మొక్కలు, కూలీలు, కలుపు మందుల రూపేణా ఇప్పటివరకు కేవలం రూ.10 వేలు మాత్రమే ఖర్చయింది. ఆయిల్‌పామ్ కాత దశకు చేరేసరికి సర్వి మొక్కల పెంపకం పెంపకం ఆయిపోతుందని' వివరించారు.

ప్రశ్న - సమాధానం

యాసంగిలో కంది, పెసర సాగు చేయదలిచాను అనువైన రకాలు, అవసరమైన విత్తనం.. ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చో తెలపండి..? – మారెపల్లి రామచంద్రారెడ్డి, హసన్‌పర్తి.

యాసంగిలో పెసరను అక్టోబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ 295, ఎంజీజీ 397(మధిర), ఎంజీజీ 378(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), డబ్ల్యూజీజీ 37 (ఏకశిల), డబ్ల్యూజీజీ 72(యాదాద్రి) రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కందిని అక్టోబర్ 15 వరకు ఏక పంటగా, వేరుసెనగతో మిశ్రమంగా సాగుచేసుకోవచ్చు. కందిలో డబ్ల్యూఆర్‌జీ 53, టీడీఆర్‌జీ 4, ఆర్‌జీటీ1, పీఆర్‌జీ 158, ఎంఆర్‌జీ 41, పీఆర్‌జీ 158 ఎంజీఆర్‌జీ 1004 రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట



వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే

సామాజిక తత్వవేత్త జ్యోతిరావు ఫులే



ఫులే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, న్యూస్‌టుడే: సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం బహుజన వర్గాలను ఏకం చేసిన మహనీయుడు జ్యోతిరావు ఫులే అని ఎమ్మెల్యే కేఆర్‌.నాగరాజు అన్నారు. సోమవారం చింత నెక్కొండలో హితకారిని ఫౌండేషన్‌ అధ్యక్షుడు గటిక మల్లయ్య ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫులే విగ్రహం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ఆవిష్కరించారు. కుల వ్యతిరేకతను రూపుమాపాలని, బహుజనులు విద్యావంతులుగా ఎదగడం కోసం పాటుపడిన గొప్ప తత్వవేత్త అని కొనియాడారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు భాజపా నేతలు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేతల వాగ్వాదం: ఫులే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కేఆర్‌.నాగరాజు ఎదుటే మండల కాంగ్రెస్‌ నాయకుల మధ్య వర్గ విభేధాలు బయటపడ్డాయి. ఒకరినొకరు బహిరంగంగా దూషించుకోవడం చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్యేను నిలదీసిన కాంగ్రెస్‌ నేత

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణ శివారులో సోమవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే కేఆర్‌.నాగరాజును మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ అరుణ తండ్రి(కాంగ్రెస్‌ నేత) భిక్షపతి ప్రొటోకాల్‌ విషయంలో నిలదీశారు. తన వార్డులో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వచ్చే ముందు చెప్పరా. ఫోన్‌ చేసినా సమాచారం ఇవ్వరు.. రావొద్దు అంటే ఊరుకుంటాం అని ఆవేదన తెలిపారు. దీంతో ఎమ్మెల్యే తన వ్యక్తిగత సహాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ నేతలు మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ను సముదాయించడంతో ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యమేల?

● అధికారులపై కమిషనర్‌ ఆగ్రహం



అధికారులకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

కార్పొరేషన్‌, న్యూస్‌టుడే: ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వీడాలి. వచ్చే వారంలోపు జుల్లో 80 శాతం సమస్యలు పరిష్కరించాలని వింగ్‌ అధికారులను గ్రేటర్‌ వరంగల్‌ కమిషనర్‌ డా.అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్‌ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల తీరు సరిగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్‌, ప్రజారోగ్య విభాగాల అధికారులను మందలించారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో 70 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్‌ శాఖకు సంబంధించి 17, ప్రజారోగ్యం 09, పన్నుల విభాగం 08, టౌన్‌ప్లానింగ్‌ 33, వీధి దీపాలు 01, ఉద్యానవన శాఖకు సంబంధించి రెండు వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రజావాణి అర్జీలపై వారాంతపు సమీక్షలు ఉంటాయని కమిషనర్‌ పేర్కొన్నారు.

● వినతులు ఇలా: కాశీబుగ్గ మధురానగర్‌-3లో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి. * 43వ డివిజన్‌ రంగశాయిపేట గవిచర్ల క్రాస్‌రోడ్‌ ఇంటి నంబరు 33-6-72 కాలనీలో మిషన్‌ భగీరథ పైపులైన్లు వేయాలి. ● పింఛన్‌పుర విలీన గ్రామంలో ఇంటిపన్ను మదింపులో తప్పులున్నాయి, వాటిని సరిచేయాలి. ● పుప్పాలగుట్టలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. బాటసారులపై దాడులు చేస్తున్నాయి. ● ఎనుమాముల శివారు సుందరయ్యనగర్‌, మణికంఠ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.



ఎవరి గోల వారిదే..! చరవాణిలో నిమగ్నమైన అధికారులు

ప్రజావాణి రద్దయినా.. కలెక్టరేట్‌కు అర్జీదారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టరేట్‌ ఇన్‌వార్డు సిబ్బంది

వరంగల్‌ కలెక్టరేట్‌: పాలనాపరమైన కారణాలతో సోమవారం జరిగే ప్రజావాణి రద్దయినప్పటికీ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అర్జీదారుల సమస్యలు వినేవారు లేకపోవడంతో ఉసూరుమన్నారు. చేసేదేమీ లేక కలెక్టరేట్‌ ఇన్‌వార్డు సిబ్బందికి అర్జీలు సమర్పించి వెనుతిరిగారు. సుమారు 25 అర్జీలు వచ్చినట్లు ఇన్‌వార్డు సిబ్బంది తెలిపారు.

● అంబేడ్కర్‌ అభయహస్తం పథకం పేరుతో కలెక్టరేట్‌కు అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్‌ రంగశాయిపేటకు చెందిన మహిళలు కొందరు.. తమకు పథకాన్ని అమలు చేయాలని కోరుతూ.. సోమవారం ఇన్‌వార్డ్‌లో అర్జీలు సమర్పించారు. ఈ పథకాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రవేశపెట్టలేదని సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ.. పథకం అమలు కోసం కలెక్టరేట్‌కు వరుసకడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా నర్సంపేట: 99635 59929 కార్పొరేషన్‌: 98484 09191 వర్ధన్నపేట: 99896 42307 వరంగల్‌ ఈస్ట్‌: 97053 46535 (10 AM TO 1 PM)

కొత్తవాడ: వరంగల్‌ 12వ డివిజన్‌లోని గౌతమినగర్‌లో చెత్తాడబ్బా వ్యర్థాలతో నిండిపోయింది. మూడురోజుల నుంచి తీయకపోవడంతో దుర్వాసన వస్తుంది.

- ఎండీ.సాధిక్‌, స్థానికుడు

సమాధానం: మంగళవారం ఉదయం పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి, చెత్త తరలిస్తాం.

- పసునూరి భాస్కర్‌, శానిటరీ సూపర్‌వైజర్‌

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నల్లబెల్లి ప్రధానరహదారి వెంట డివైడర్‌లో పిచ్చిగడ్డి ఏపుగా పెరిగింది. **- అనిల్‌, స్థానికుడు.**

సమాధానం: సిబ్బందితో శుభ్రం చేయిస్తా.

-ధర్మేందర్‌, పంచాయతీ కార్యదర్శి

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నల్లబెల్లి మండలం రుద్రగూడెంలో జాతీయరహదారి వెంట వీధి దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి పద్మనాభస్వామి దృష్టికి తీసుకెళ్లగా సోమవారం గుత్తేదారుతో వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

వలస కార్మికుడి అదృశ్యం

గీసుకొండ: గీసుకొండ మండలం శాయంపేటహవేలీలోని కాకతీయ వస్త్రపరిశ్రమలో పని చేస్తున్న వలస కార్మికుడు దిలీప్‌పరశురామ్‌ (65) అదృశ్యమైనట్లు ఎస్సై కుమార్‌ తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన దిలీప్‌పరశురామ్‌ను గత నెల 27న ప్రదీప్‌ఠాకూర్‌ ఇక్కడికి తీసుకొచ్చారు. 28న సంగెంకు వెళ్లిన దిలీప్‌ పరశురామ్‌ తిరిగిరాలేదు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో ప్రదీప్‌ఠాకూర్‌ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

వరంగల్‌ కలెక్టరేట్‌, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత కల్పించి.. కనీస వేతనం రూ.26 చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్‌ చేశారు. సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాలు తదితర పనుల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు శ్రమకు తగిన వేతనం చెల్లించడంలేదని మండిపడ్డారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, అశోక్‌, రాజేందర్‌, ఉస్మాన్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పనికల్పించేలా చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న అన్ని సంఘాల కార్మికులు

ఎనుమాముల మార్కెట్‌, న్యూస్‌టుడే: ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌పై ఆధారపడి ఏళ్లుగా జీవిస్తున్న కార్మికులకు పూర్తిస్థాయిలో పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని హమాలీ, గుమాస్తా, దడవాయి సంఘాల నాయకులు కోరారు. మార్కెట్‌ కార్యదర్శి నిర్మలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వివిధ సంఘాల నాయకులు సుంచు కనకయ్య, అయిలయ్య, ఇనుముల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌ కలెక్టరేట్‌: అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌ ప్రభుత్వం.. ఎనిమిది నెలలైనా జాబు క్యాలెండర్‌ ప్రకటించలేదని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రూ.5 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కలెక్టరేట్‌ ఏవో శ్రీకాంత్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జక్కా అశోక్‌, ఎర్ర రాజు, రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండలో..



భద్రకాళి అమ్మవారి ఉత్సవమూర్తి శేష వాహన సేవ



నల్లబెల్లిలో..



దుగ్గొండి మండలం బందంపల్లిలో..



రంగశాయిపేటలో..

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అయిదోరోజు సోమవారం శ్రీరాజరాజేశ్వరి దేవిని లలితా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చారు. వేర్వేరు రూపాల్లో దుర్గామాత దర్శనమిస్తున్నారు. అమ్మవారి రూపాలను ప్రతిష్ఠించిన వేదికలను భారీ సెట్టింగ్‌లతో ఆలయాలను తలపించేలా ఏర్పాటుచేశారు. ఒక్కో సెట్టింగ్‌ ఏర్పాటుకు రూ.లక్షల్లో ఖర్చు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. రంగశాయిపేటలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం



ఖానాపురం మండలం బుధరావుపేటలో..



గీసుకొండలోని శివాలయంలో కూరగాయల అలంకరణలో దుర్గాదేవి



చెన్నారావుపేటలో..



లలితా అలంకరణలో శ్రీరాజరాజేశ్వరి దేవి



శివనగర్‌లోని సీతారామాలయంలో.. మహాత్రిపురసుందరి దేవిగా



నర్సంపేట మండలం ముగ్ధుంపురంలో..

వైద్యులు ఉండరు.. ఇబ్బందులు తప్పవు



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల గది

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 36 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని కడారిగూడెం గ్రామానికి చెందిన పవన్‌ సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స కోసం మధ్యాహ్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో వైద్యులు విధుల్లో లేకపోవడంతో నర్సులు చికిత్స చేశారు. కొంత సమయం తర్వాత సమీపంలో సొంత ప్రైవేటు వైద్యశాల నిర్వహిస్తున్న ఆసుపత్రి వైద్యుడు వచ్చి పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించకపోవడంపై రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఆసుపత్రి సూపరింటెండెంట్‌ రామ్మూర్తిని వివరణ కోరగా.. వైద్యులు అందుబాటులో లేని విషయం మా దృష్టికి రాలేదని, విచారణ చేపడతామన్నారు.

లింగంపల్లిని పంచాయతీ చేయాలి

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని ఏనుగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని లింగంపల్లిని నూతన పంచాయతీ చేయాలని గ్రామస్థులు సోమవారం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. లింగంపల్లిలో 530 మంది ఓటర్లు 900 మంది జనాభా కలిగి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, రవీందర్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇకనైనా ఇజ్రాయెల్‌ మారణకాండ ఆపాలి



వరంగల్‌ తపాలా కార్యాలయం జంక్షన్‌లో వామపక్ష పార్టీల నాయకులు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్‌ జరుపుతున్న మారణకాండను ఇకనైనా ఆపాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్‌ చేశారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ(యూ), సీపీఐ(ఎంఎల్‌) లిబరేషన్‌, ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీల నాయకులు సంయుక్తంగా వరంగల్‌ తపాలా కార్యాలయం జంక్షన్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. వామపక్ష పార్టీల నాయకులు రాచర్ల బాలరాజు, మేకల రవి, రంగయ్య, గోనె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి తగ్గించడం సరికాదు

కొత్తవాడ, న్యూస్‌టుడే: కొత్త ఎల్‌ఐసీ పాలసీలపై వయోపరిమితిని తగ్గించడం సరికాదని ఆల్‌ ఇండియా ఎల్‌ఐఏఎఫ్‌ఐ యూనియన్‌ నాయకుడు రాజా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ములుగురోడ్డులోని వరంగల్‌ బ్రాంచి-1 సీనియర్‌ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజా శ్రీనివాసరావు మాట్లాడారు. నూతన పాలసీలపై వయో పరిమితితో పాటు ఏజెంట్స్‌ మొదటి ప్రీమియం తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌ఐసీ ఏజెంట్స్‌ అశోక్‌, రవీందర్‌రావు, వీరస్వామి, సురేందర్‌, భిక్షపతి, సదానందం పాల్గొన్నారు.

వృద్ధులను ఆశ్రమాలకు తరలించండి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: బస్‌ షెల్టర్లలో ఉంటున్న వృద్ధులను ఆశ్రమాల్లో చేర్పించాలని సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి తేరాల యుగేందర్‌ బల్దియా కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం వరంగల్‌ ఎంజీఎం ఆసుపత్రి ముందున్న బస్‌షెల్టర్‌లో ఆశ్రయం ఉంటున్న వృద్ధుల స్థితిని పరిశీలించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

చేపల మార్కెట్లు ఏర్పాటు చేయాలి

రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్‌, హనుమకొండ ప్రాంతాల్లో చేపల మార్కెట్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం చేపల విక్రయదారులు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌ డా.అశ్విని తానాజీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాజీపేట బాపూజీనగర్‌, ఫాతిమా కూడలి, వడ్డేపల్లి చర్చి, తిరుమల బార్‌ సెంటర్‌, కుమార్‌పల్లి, పెగడపల్లి డబ్బాలు, హసన్‌పర్తి చెరువుకట్ట, వరంగల్‌ అండర్‌ బ్రిడ్జి, కాశీబుగ్గ, దేశాయిపేట తదితర ప్రాంతాల్లో కొన్నేళ్లుగా వందలాది మంది మత్స్యకారులు చేపలు అమ్ముతున్నారని, కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంకట్‌ ఆరోపించారు. రూ.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక చేపల మార్కెట్‌ ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యకారులు, కార్మిక సంఘం నాయకులు నిమ్మల రాజేందర్‌, దుర్గయ్య, రవి, శ్రీలత, మమత, వనమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బతుకమ్మ పాటల పోటీలు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రంగశాయిపేట కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించారు. ఆదివారం రాత్రి స్థానిక జనతా పరపతి సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను కార్పొరేటర్‌ గుండు చందన, సంఘం అధ్యక్షుడు కేడల మల్లేశం ప్రారంభించారు. 12 మహిళా బృందాలు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. విజేతలకు సద్దుల బతుకమ్మ రోజు బెస్తం చెరువు ఆట స్థలంలో బహుమతులు అందజేయనున్నట్లు సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం సూరిపల్లికి చెందిన కాయిత సతీష్‌(48) ఈ నెల 5న ఇంటి ముందు ఉన్న మెట్లను ఎక్కుతుండగా జారి పడడంతో తల వెనుకభాగంలో దెబ్బ తగిలింది. రక్తస్రావం కాకపోవడంతో ఆరోజు ఆసుపత్రికి వెళ్లలేదు. మరుసటి రోజు ఉదయం ముక్కు నుంచి రక్తం కారడంతో 108 వాహనంలో నర్సంపేటలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్‌ నగరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం దొరికినట్లు సోమవారం ఇంతేజార్‌గంజ్‌ ఠాణా పోలీసులు తెలిపారు. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. వరంగల్‌ అండర్‌ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి(57) మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా భిక్షాటన చేస్తున్నాడని స్థానిక దుకాణదారులు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారు.

జూద కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసుల దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్‌ పోలీసు డివిజన్‌లో జూద కేంద్రాలపై సోమవారం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసి జూదం ఆడుతున్న వారిని పట్టుకొని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ ఎ.మధుసూదన్‌ కథనం మేరకు మిల్స్‌కాలనీ ఠాణా పరిధి క్రిస్టియన్‌ కాలనీలో మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి జూదమాడుతున్న నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.13వేల నగదు స్వాధీనం చేసుకున్నాం. మట్టెవాడ ఠాణా పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన మరో ఆరుగురు జూదం ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8,460 స్వాధీనం చేసుకొని కేసు నమోదు, విచారణ కోసం ఆయా ఠాణాల్లో అప్పగించారు.

నర్సంపేట: నర్సంపేట శాంతినగర్‌లోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న జూద శిబిరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఓ మహిళతో సహా ఆరుగురు జూదరులను పట్టుకున్నట్లు ఎస్సై రవికుమార్‌ తెలిపారు. వారి వద్ద రూ.6440 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వరంగల్‌క్రైం: ఇంతేజార్‌గంజ్‌ ఠాణా పరిధి తిలక్‌నగర్‌లోని సట్టా కేంద్రంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేశారు. షేక్‌ షకీల్‌ సట్టా ఆడుతూ పట్టుబడ్డారు. అతని నుంచి రూ.2910 నగదు, చరవాణి, సట్టా చిట్టీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు విచారణ కోసం ఇంతేజార్‌గంజ్‌ పోలీసులకు అప్పగించామని టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ ఎ.మధుసూదన్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. కేసు నమోదు

రంగశాయిపేట: వరంగల్‌- ఖమ్మం ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్‌ కథనం ప్రకారం.. ఏకశిలా నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బండ గౌరీశంకర్‌ ఈ నెల 2న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ సమీపంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ప్రమాదానికి కారణమైన సయ్యద్‌పాషాపై సోమవారం బాధితుడు గౌరీశంకర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నర్సంపేట నియోజకవర్గం

రచయిత కందికొండ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ గేయ రచయిత కందికొండ యాదగిరి విగ్రహాన్ని ఆయన స్వగ్రామమైన నర్సంపేట మండలం నాగుర్లపల్లిలో సోమవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆవిష్కరించారు. కందికొండ కుటుంబ సభ్యులు ఈ విగ్రహాన్ని గ్రామ కూడలిలో ఏర్పాటు చేశారు. మార్కెట్‌ కమిటీ ఛైర్మన్‌ శ్రీనివాస్‌, టీపీసీసీ సభ్యుడు రామానంద్‌, రాజేందర్‌, లక్ష్మణ్‌, శోభన్‌, యాదగిరి భార్య రమ, కుమారుడు ప్రభంజన్‌ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

నర్సంపేట, న్యూస్‌టుడే: కర్రతో పొడవైన కలాన్ని రూపొందించిన నర్సంపేటకు చెందిన కుదురుపాలక జగదీశ్‌ను సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు రామానంద్‌, పట్టణ అధ్యక్షుడు రాజేందర్‌, మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్‌, మున్సిపల్‌ కాంగ్రెస్‌ ఫ్లోర్‌ లీడర్‌ సాంబయ్య, విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదర్శనాచారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

నర్సంపేట, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి టీయూసీఐలోకి ఐఎఫ్‌టీయూను విలీనం చేయనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎ.రాజు తెలిపారు. నర్సంపేటలో సోమవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనకు బలమైన ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న సభను కార్మికులు జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రాజేందర్‌, వీరారెడ్డి, శ్యామ్‌, శేఖర్‌, పాణి, శంకర్‌, విఠల్‌, మనోహర్‌చారి పాల్గొన్నారు.

అన్ని పంటలకు బోనస్‌ చెల్లించాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్‌ చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన రాసిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. సన్నరకం ధాన్యానికి రూ.500 ప్రకటించి, దొడ్డు రకం ధాన్యానికి బోనస్‌ ఇవ్వక పోవడం రైతులను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

గొర్రెల చోరీ

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం చంద్రయ్యపల్లిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు గొర్రెలను అపహరించారు. బోయిని రాజు, ఎర్లంశెట్టి యాకయ్య, పల్లికొండ నర్సయ్య, అశోక్‌లకు చెందిన రెండు పొట్టేళ్లు, మరో రెండు గొర్రెలను చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని గొర్రెల కాపరులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్‌ తెలిపారు.

క్వారీల్లో అధికారుల తనిఖీలు

సంగెం, న్యూస్‌టుడే: తీగరాజుపల్లి శివారులోని జీఎం స్టోన్‌క్రషర్‌, జేబీసీ స్టోన్‌ మెటల్‌, భాగ్యలక్ష్మి అసోసియేట్స్‌, పల్లారుగూడ శివారులోని ఆర్‌ఎన్‌ గ్రానైట్స్‌ క్వారీల్లో సోమవారం ఆర్డీవో కృష్ణవేణి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ అధికారులు తనిఖీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీపీ తిరుపతి, మైనింగ్‌ ఏడీ రవిశంకర్‌, నీటిపారుదల శాఖ డీఈఈ గణేష్‌, తహసీల్దార్‌ రాజ్‌కుమార్‌, ఎంపీవో కొమురయ్య, ఎస్సై నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

చేపల వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ

కీర్తినగర్‌కాలనీ(గీసుకొండ), న్యూస్‌టుడే: గీసుకొండ మండలం గొర్రెకుంటలోని మహిళా మత్స్య సహకార సంఘం కార్మికులు చేపల వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు, పురుగు మందులను తయారు చేశారు. సేంద్రియ ఎరువులను సోమవారం ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఫిషరీష్‌ ఫెడరేషన్‌ మాజీ ఛైర్మన్‌ పిట్టల రవీందర్‌ మాట్లాడారు.